ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 28 ఏప్రిల్ 2024





పెరిగిన ఓటర్లు

- అనుబంధ జాబితా విడుదల చేసిన అధికారులు
- జిల్లాలో మొత్తం ఓటర్లు 7,12,710
- మహిళలదే ఆధిక్యత

జగిత్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించింది. ఈ మేరకు శాసనసభ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు ఈనెల 15 వరకు అవకాశం కల్పించారు. 1 జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటరుగా నమోదు చేసుకోవడా నికి అవకాశం కల్పించడంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోనూ గత శాసనసభ ఎన్నికల ఓటర్లతో పోల్చితే 4,231 మంది ఓటర్లు పెరిగారు. తుది జాబితా ప్రకారం జిల్లాలో 7,12,710 మంది ఓటర్లు ఉన్నారు.

నాలుగు దశల్లో పరిశీలన...

ప్రస్తుతం తుది జాబితా ప్రకారం జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 7,12,710 మంది ఉన్నారు. మార్పులు, చేర్పులతో పాటు సవరణల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా చేపట్టారు. నాలుగు దశల్లో ఈ విధానాన్ని అమలు చేశారు. మొదటి దశలో బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో, రెండో దశలో ఓటరు పర్యవేక్షణ అధికారి, మూడోదశలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నాలుగోదశలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆమోదించారు, ఇలా అన్ని దరఖాస్తులను యంత్రాంగం క్షణ్ణంగా పరిశీలించారు. ఒక పేరు రెండు సార్లు ఉండడం, చనిపోయిన వారి పేర్లు ఉండడం, ఇతరత్రా పొరపాట్లు ఉన్న పాత ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించారు.

ఓటరు నమోదుకు స్పందన...

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి జిల్లాలో మంచి స్పందన లభించింది. అధికార యంత్రాంగం నెల రోజులుగా అదే పనిలో నిమగ్నమై నిర్వహించిన విస్తృత ప్రచార కార్యక్రమాలకు ఫలితం కనిపించింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 4,231 మందికి కొత్తగా ఓటు హక్కు లభించింది. పార్లమెంటు ఎన్నికల్లో అర్హులైన వారందరూ ఓటు వేయడానికి 1 జనవరి 2019 నాటికి 18 ఏళ్ల నిండిన వారంతా ఈ నెల 15 వరకు ఓటరు నమోదు చేసుకోవడానికి అర్హులని తేల్చింది. జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం నిర్వహించిం ది. ఓటర్ల నమోదుపై కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కేంద్రం ఏర్పాటు చేశారు.

మహిళలే అధికం...

కొత్తగా ఓటర్లుగా నమోదైన వారికి ఎన్నికల అధికారులు ప్రత్యేక అనుబంధ ఓటరు జాబితా విడుదల చేశారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలు కలిపి మొత్తం నాలుగు వేలకు పైగా కొత్త ఓటర్లు నమోదయ్యారు. జగిత్యాల నియోజకవర్గం నుంచే అత్యధికంగా కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నారు. ప్రతి నియోజక వర్గంలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా నమోదు చేసుకున్నారు. దరఖాస్తు దారుల అడ్రస్ అనుసరించి అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేశారు. అనంతరం అనుబంధ ఓటరు జాబితా విడుదల చేశారు. ఇదే జాబితా అనుసరించి పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్నారు.

నెల రోజుల్లో పెరుగుదల...

నెల రోజుల్లో జిల్లా పరిధిలోని ఓటర్లు పెరిగారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితాను ప్రకటించగా 7,08,479 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. అప్పటి నుంచి కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 15వ తేదీ చివరి తేదీగా ప్రకటించారు. గడిచిన నెల రోజుల్లో జిల్లాలో 4,231 మంది ఓటర్లు పెరిగారు. ఈ ఓటర్ల జాబితాలో పేర్లున్న వారంద రూ ఓటరు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది.

ప్రస్తుతం పెరిగిన ఓటర్లు ఇలా...

ప్రస్తుతం పెరిగిన లెక్కల ప్రకారం జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ నియోజవకర్గాల పరిదిలో 7,12,710 మంది మొత్తం ఓట ర్లున్నారు. ఇందులో పురుషులు 3,42,216 మంది, మహిళలు 3,70,460 మంది, ఇతరులు 34 మంది ఉన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,30,786 ఉండగా, పురుషులు 1,12,442 మంది, మహిళలు 1,18,338 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. జగిత్యాల నియోజ కవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,675 ఉండగా, పురుషులు 1,13,392 మంది, మహిళలు 1,23,259 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,45,249 ఉండగా, పురుషులు 1,16,382 మంది, మహిళలు 1,28,863 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన 'అడ్లూరి'



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న అడ్లూరి, జువ్వాడి

కోరుట్ల, ఏప్రిల్ 27 : కోరుట్లలో వచ్చే నెల 1న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న నేపథ్యంలో శనివారం సభాస్థలాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరిశీలించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావులతో కలసి పశువైద్య కళాశాల శివారులో స్థలాన్ని ఎంపిక చేశారు. సీఎం సభకు భారీ ఎత్తున ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్, మైనారిటీ, ఎస్సీ విభాగాలకు చెందిన నాయకులు ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభ స్థలాన్ని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ పరిశీలించారు. శనివారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావుతో కలిసి మండలంలోని చౌలమద్ది గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించారు. మే 1న నిర్వహించే బహిరంగ సభలో సీఎం పాల్గొనున్నారు. సీఎం సభ ప్రాగణంలోని ఏర్పాట్లు, ట్రాఫిక్ నిబంధనలు, పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా మే 3న మండలంలోని రాజారాంపల్లి గ్రామానికి వస్తున్నాడని ఈ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరిలక్ష్మణ్ కుమార్ అన్నారు. పోలీస్ అధికారులతో, కార్యకర్తలతో కలిసి సభా స్థలాన్ని పరిశీలిం చారు. ఈ సభకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విప్ అడ్లూరి ప్రజలకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు శైలెందర్ రెడ్డి, మదుందల గోపాల్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రయోజనాలు అందించాలి

- పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



రాష్ట్ర అధ్యక్షుడికి జ్ఞాపిక అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

మల్యాల, ఏప్రిల్ 27: గత మార్చి నెల నుంచి పదవి విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండవ పీఆర్సీ ప్రయోజనలను వర్తింపచేయాలని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని తక్కళ్లపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెండవ పీఆర్సీని గత జూలై నుంచి అమలు చేస్తూ గత పీఆర్సీలో నష్టపోయిన 2017 టీఆర్టీ ఉద్యోగులకు నాలుగు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ఆయన వెంట పీఆర్‌టీ యూటీఎస్ నాయకులు యాల్ల అమర్నాథ్ రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు, జాలి మహేందర్‌రెడ్డి, రత్నాకర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, విజయరావు పాల్గొన్నారు

కొండగట్టులో భక్తుల సందడి



క్యూలైన్ లో వేచి ఉన్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 27: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్న సన్నిధికి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా భక్తులు తమ నూతన వాహనాలకు పూజలు చేయించారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

కోరుట్ల ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ

కోరుట్ల, ఏప్రిల్ 27 : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌ను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావులతో కలిసి పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలన జరిపి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విచారణలో ఉన్న కేసుల వివరాలను తెలుసుకోని వాటి పరిష్కరనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకుంటున్న భద్రత్త విషయాలను స్థానిక సీఐ సురేష్ బాబులను అడిగి తెలుసుకోని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా పోలీసు అధికారులు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి'

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజులను సకాలంలో చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు వచ్చే నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయని, ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 2వ తేదీ లోపు ఫీజులను చెల్లించాలని సూచించారు. పరీక్షలకు హాజరవ్వాలనుకున్న విద్యార్థులు తాము చదివిన కళాశాలలో ప్రిన్సిపాల్‌కు ఫీజును చెల్లించాలని తెలియ జేశారు. పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరి తేదీ పెంచే అవకాశం లేదని, సకాలంలో ఫీజు చెల్లించాలని కోరారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించ నున్నామని తెలిపారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

రాయికల్, ఏప్రిల్ 27: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల, మైతాపూర్, భూపతి పూర్ మాజీ సర్పంచులు సామల్ల లావణ్యవేణు, ఎండీ అజారొద్దీన్, జక్కుల చంద్రశేఖర్‌తో పాటు నాయకులు మేర శ్రీనివాస్, మర్రిపెల్లి ఖాసీం, అనంతుల సుమన్‌లు జీవన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి జీవన్ రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ వస్తే అదానీ, అంబానీలకే దేశ సంపద పంపిణీ

- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కథలాపూర్, ఏప్రిల్ 27 : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ సంపద ముస్లింలకు పంచి పెడతారని అబద్ధాలు చెబుతున్న ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ మరోసారి వస్తే అదానీ, అంబానీలకు పంపిణీ చేస్తారని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రోడ్డు షో నిర్వహించారు. బీజేపీ రాముడి ఫోటోలు పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని దేవుడు గుళ్లో ఉంటాడని భక్తి గుండెల్లో ఉంటుందని వారు గమనించాలని సూచించారు. చేతి గుర్తుకు ఓటు వేసి రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, సత్యనారాయణ, హరిప్రసాద్ ఉన్నారు.

మేడిపల్లి : దేవుడి పేరుతో రాజకీయం చేసే బండి సంజయ్‌ను ప్రజలు ఒడగొట్టి అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం మాట్లాడుతూ తాము తాత ముత్తాతల నుంచి రాముడిని పూజిస్తున్నామని, బీజేపీ దేవుడి పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తుందో అలాగే దేశంలో కూడా పథకాలు అమలు చేయాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు, కాంగ్రెస్ నేతలు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, యూసుఫ్, ముబీన్ పాల్గొన్నారు.

భీమారం: దేశంలో నరేంద్ర మోదీ నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో శనివారం కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్ధతుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లు ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు రాజేష్ పార్టీలో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొడిమ్యాల: దేశంలో కాంగ్రెస్ పార్టీతోనె రామరాజ్యం సాధ్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి మండల కేంద్రంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన రోడ్‌షో నిర్వహించారు. చేతి గుర్తుపై ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని అభ్యర్థి రాజేందర్‌రావు ఓటర్లను కోరారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, మల్లిఖార్జున్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది

ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే రెండు పార్టీలు ఒక్కటై తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో వాకర్స్, యువకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కలుగులోని ఎలుక అని, ఎన్నికలప్పుడుమాత్రమే బయటకు వస్తాడని, ఆ తర్వాత ఫాంహౌస్‌కే పరిమితమవుతాడనిఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి బీజేపీని పాకిస్తాన్ టీంగా అభివర్ణించడాన్ని తప్పు పట్టారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ముస్లిం ఓట్లను కొల్లగొట్టేందుకు తమది ముస్లిం పార్టీ అని తుమ్మల నాగేశ్వర్‌రావు చెబుతున్నారంటే ఎవరిది పాకిస్తాన్ జట్టో ప్రజలకు అర్థమయిపోయిందన్నారు. బీజేపీ భారతీయ ఆత్మ అని, హిందుత్వ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న పార్టీ అన్నారు. ఫైటర్స్.. చీటర్స్..లూటర్స్ జరుగుతున్న పోరులో ఫైటర్స్ పార్టీ బీజేపీ గెలుస్తుందన్నారు. ప్రజల ముఖమే చూ డని అభ్యర్థులకు, ప్రజల పక్షాన నిత్యం ప్రశ్నించే గళానికి పోటీ అన్నారు. కెప్టెన్ దిక్కులేని కాంగ్రెస్‌తో తమకు పోటి ఏమిటని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధించబోతున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోతాయని చెప్పడం కాంగ్రె స్ ఆడుతున్న రాజకీయ డ్రామాలో భాగమేనన్నారు. బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ రావడమే గొప్ప అన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేసి గెలవాలని చూస్తున్నారన్నారు.

జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 27 : కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో శనివారం పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. విప్ హాజరై మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరుపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలేదన్నారు. బీజేపీ, బీఆర్ ఎస్‌ల ప్రజా వ్యతిరేఖ విధానాలను ఓటర్లుకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో మే 1, 3వ తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలు ధర్మపురి, కోరుట్లలో ఉన్నాయని పెద్ద ఎ త్తున కార్యకర్తలు తరలివచ్చేవిధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, నాయకులు అనిత, మన్సూర్, జగదీశ్వర్, మహంకాళి రాజన్న, జిల్లా గంగాధర్, ప్రభాకర్ రెడ్డి, రమేష్ రావు ఉన్నారు.

- నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జీవన్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి ఆధ్వర్యంలో నాయకులు 39వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు ఉన్నారు.

బీర్‌పూర్: ఉపాధి హామి కూలీల మధ్య కాంగ్రెస్ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జీవన్ రెడ్డికి మద్దతుగా మండల కాంగ్రెస్ నాయకులు రేకులపల్లి గ్రామంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి చేతిగుర్తుకు ఓటువేసి జీవన్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్‌రావ్, ఉమ్మడి సారంగాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ ప్రచార కన్వీనర్ జితేందర్ యాదవ్ పాల్గొన్నారు.

సోదరుల మధ్య ఘర్షణ .. తమ్ముడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో శనివారం ఇద్దరు సోదరులు ఘర్షణ పడగా తమ్ముడు కాల్వ వెంకటేష్‌యాదవ్(28) మృతి చెందాడు. గ్రామస్థులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కాల్వ వెంకటేష్, కాల్వ శ్రీనివాస్‌లు అన్నదమ్ములు. మద్యానికి బానిసైన ఇద్దరు సోదరులు ఎలాంటి పనులు చేయకుండా తరచుగా గొడవపడుతుంటారు. వారి తండ్రి రాయమల్లు గొర్లకాపరిగా పనిచేస్తుంటాడు. శనివారం సాయంత్రం అన్నదమ్ముల మధ్య గొడవ జరగ్గా శ్రీనివాస్ ఇంటిలోని ఈలపీటతో వెంకటేష్ నడుం భాగంలో కొట్టాడు. దీంతో ఆగ్రహంతో శ్రీనివాస్‌ను వెంకటేష్ కొట్టేందుకు రాగా అతన్ని నెట్టివేయడంతో భవనం పిల్లర్‌కు తల తగిలింది. దీంతో వెంకటేష్ చెవుల నుంచి రక్తం కారి కొద్దిసేపటికి మరణించాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

760 లీటర్ల మద్యం సీజ్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలలో బెల్ట్ షాప్‌లపై దాడులుచేసి రూ. 4.60 లక్షల విలువైన 760 లీటర్ల మద్యంను సీజ్ చేశామని సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించిన 96 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ యజమానులు బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ 109 మందిపై కేసులు నమోదు చేసి రూ .5.17లక్షల విలువైన 957 లీటర్ల మద్యం సీజ్‌చేశామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్‌లు, కిరాణ దుకాణాల్లో, ఇతర ఇళ్లల్లోనూ ఎవరైనా బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని దుప్పి మృతి

కథలాపూర్, ఏప్రిల్ 27: మండలంలోని దుంపెట శివారులో వరద కాలువ వద్ద శనివారం కారు ఢీకొట్టిన ఘటనలో చుక్కల దుప్పి మృతి చెందింది. సెక్షన్ అధికారి మల్లేశం కథనం ప్రకారం.. చింతకుంటకు చెందిన అనుప రాజేశ్ టీఎస్ 21 సీ 8991 నంబర్ గల కారులో తన స్వగ్రామం వెళ్తుండగా అటువైపు నుంచి వేగంగా వచ్చిన దుప్పిని ఢీకొట్టాడు. గాయాల పాలై అపస్మారక స్థితికి చేరిన దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. కారును సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు సెక్షన్ అధికారి తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: ధాన్యం కుప్పలను బైక్ ఢీకొన్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన వ్యక్తి ఎర్రుపల రాములు తీవ్ర గాయాలపాలయ్యాడని సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. రోడ్డుపై ధాన్యం కుప్పలు పోసి ప్రమాదానికి కారణమైన కిష్టునాయక్‌తండాలోని రైతు భూక్య నరేశ్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రాములు తన ద్విచక్ర వాహనంపై ఈ నెల 26న సాయంత్రం గొల్లపల్లికి వెళ్లి రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో రహదారిపై ఉన్న ధాన్యం కుప్పలను ఢీకొట్టాడని చెప్పారు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని వివరించారు. బాధితుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు రోడ్డుకు అడ్డుగా ధాన్యం కుప్పలు పోసిన రైతు నరేశ్‌పై ఎస్ఐ రమాకాంత్ కేసు నమోదు చేయగా దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్- కోరుట్లపేట గ్రామ శివారులోని రహదారిపై ఉన్న వరి ధాన్యం కుప్పను ద్విచక్రవాహనంతో శనివారం రాత్రి ఢీకొన్న సంఘటనలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రాజనర్సు తీవ్ర గాయాలపాలయ్యాడు.

జగిత్యాలలో రెండిళ్లలో చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 27: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న ఆదర్శనగర్‌లో రెండిళ్లలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆదర్శనగర్‌కు చెందిన శేఖర్‌రెడ్డి, కోటి అనే ఇద్దరు వ్యక్తులకు చెందిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.61 వేల నగదును అపహరించుకవెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 27: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 24న రాత్రి గ్రామంలో హరీష్ అనే వ్యక్తి తన బంధువులతో సహా డ్యాన్స్ చేస్తుండగా అటువైపుగా వెళ్లిన మ్యాకల ఉదయ్ అనే వ్యక్తిని ఆపి చేతులతో కొట్టి, కులం పేరుతో దూషించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఉదయ్ ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ రావు శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సాక్షులను విచారించారు.

కంబోడియా కేంద్రంగా సైబర్ మోసాలు

● చైనీస్ కంపెనీ పేరిట కాల్ సెంటర్ ● ఇద్దరి ఏజెంట్ల అరెస్టు, మరో ఇద్దరికి లుక్ అవుట్ నోటీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: కంబోడియా కేంద్రంగా చైనీస్ కంపెనీ పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠా వ్యవహారాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్ చేసి మరో ఇద్దరికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మి తన కుమారుడు శివప్రసాద్‌ను గల్ఫ్ పంపేందుకు జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన కంచర్ల సాయిప్రసాద్ అనే ఏజెంట్‌ను కలిసింది. ఇందుకోసం రూ.1.40 లక్షలు ఇచ్చింది. ఏడాది క్రితం శివప్రసాద్‌ను కంబోడియా పంపించిన ఏజెంట్ సైబర్ మోసాలకు పాల్పడే కాల్‌సెంటర్‌లో పని ఇప్పించాడు. ఇండియాకు చెందిన ఫోన్ నంబర్లకు కాల్ చేసి సైబర్ మోసం చేయమంటూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివప్రసాద్ తన తల్లి ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చాడు. లక్ష్మి ఫిర్యాదుతో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. చైనీస్‌కు చెందిన కంపెనీలో శివప్రసాద్ పాస్‌పోర్ట్ తీసుకున్నట్లు, సైబర్ నేరాలు చేయిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడితోపాటు ఇండియాకు చెందిన 600 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే కంబోడియాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడినట్లు, బాధితుడి వివరాలు పంపించి అక్కడి పోలీసుల సహాయంతో రెస్క్యూ చేసి శివప్రసాద్‌ను కాపాడినట్లు ఎస్పీ చెప్పారు. శివప్రసాద్ రెండు రోజుల్లో సిరిసిల్లకు చేరుకుంటాడని, మిగతా బాధితులను ఇండియాకు పంపించే ఏర్పాట్లు చేశామని ఎస్పీ వివరించారు.

ఉపాధి పేరిట సైబర్ మోసాలకు పాల్పడే కాల్ సెంటర్‌లో ఉద్యోగం పెట్టించి మోసం చేసిన ఏజెంట్లు జగిత్యాల జిల్లా కొడిమ్యాల గ్రామానికి చెందిన కంచర్ల సాయిప్రసాద్, మహారాష్ట్రలోని పూణేకు చెందిన అబిద్ అన్సరీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

● కమీషన్‌ల కోసం ఏజెంట్ల దందా

కమీషన్‌ల కోసం ఏజెంట్లు దందాకు పాల్పడుతున్నట్లు తేలింది. కంబోడియా ఏజెంట్‌గా పనిచేసిన సాయిప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. బాధితుడు ఇచ్చిన మొత్తంలో సాయిప్రసాద్ రూ.10వేల కమీషన్ తీసుకొని లక్నోకి చెందిన సదాకత్ అనే వ్యక్తికి పంపిస్తాడు. ప్రస్తుతం మాల్దీవ్స్‌లో ఉంటున్న సదాకత్ రూ.10వేల కమీషన్ తీసుకొని పూణేకు చెందిన అబిద్ అన్సరీకి పంపిస్తాడు. అతను దుబాయ్‌లో ఉంటున్న బీహార్‌కు చెందిన షాదబ్ అనే వ్యక్తికి మిగిలిన మొత్తంతో పాటు, పాస్‌పోర్టు పంపిస్తే కంబోడియా దేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్పీ చెప్పారు. దీంతో కంచర్ల సాయిప్రసాద్, అబిద్ అన్సరీ అనే ఏజెంట్లను అరెస్ట్ చేశామని, సాయిప్రసాద్‌ను కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. అబిద్ అన్సరీకి నోటీసులు ఇచ్చి పంపామని, పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. గల్ఫ్ ఉద్యోగాల పేరిట ఏజెంట్ల చేతిలో మోసపోతే వెంటనే 8712656411కు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు నిధి ఆప్కే నికత్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం, ఈఎస్ఐసీ సంయుక్తంగా ఈనెల 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు నిధి ఆప్కే నికత్-2 (పీఎఫ్ మీ ముంగిట) జిల్లా అవగాహన శిబిరం, ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగునూరు ప్రతిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్)లో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాకు సంబంధించి సుల్తానాబాద్ రఘురామ్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, జగిత్యాల జిల్లా కోరుట్ల మోసాక్ బీడి వర్క్స్‌లో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు సంబంధించి తంగళ్లపల్లి ఠాకూర్ వైఎస్ బీడీ వర్క్స్‌లో, మంచిర్యాలలో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో, ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించి సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో, ఆదిలాబాద్‌లో నలంద డిగ్రీ కళాశాలలో, నిర్మల్‌లో ఎస్‌టి థామస్ స్కూల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్షనర్లు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

వరిపంట దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 27: మండలంలోని మల్యాల గ్రామ శివారులో ఆ గ్రామానికి చెందిన రైతు పంజాల శంకరయ్య కోతకొచ్చిన ఎకరంన్నర వరి శనివారం అగ్నికి ఆహుతి అయింది. పొలం దగ్ధమై సుమారు లక్ష రూపాయల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. వరి పొలం ప్రమాదవశాత్తు కాలిందా ఎవరైనా అంటు పెట్టారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కక్షతోనే వరి పంటకు నష్టం చేశారని బాధితుడు తెలిపారు.

నగదు స్వాధీనం

పాలకుర్తి, ఏప్రిల్ 27: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి అడ్డరోడ్డు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా 2,41,760 రూపాయల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. జిల్లాలోని జూలపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లారపు శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద లక్ష రూపాయలు, మంచిర్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన తాళ్ల సతీష్‌కుమార్ అనే వ్యక్తి వద్ద 61 వెయ్యి 760 రూపాయలు, అదే గ్రామానికి చెందిన ఎడ్ల గణేష్ వద్ద 80 వేల రూపాయలను సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అందించినట్లు ఎస్సై తెలిపారు.

● ఇల్లందకుంట : మండలంలోని సిరిసేడు గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ.1.50లక్షలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సిద్దిపేటకు చెందిన పృధ్వీరాజ్ అనే అతను ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బులు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు సీఐ కిశోర్ పేర్కొన్నారు. ఎస్ఐ రాజకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

వీణవంక, ఏప్రిల్27: మండలంలోని బేతిగల్‌లో చొప్పరి తిరుపతి అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 2,400 రూపాయల విలువ చేసే బ్రాందీ, విస్కీ, పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేతన్నలను పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్

● పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేండ్లు పరిపాలించినా పవర్‌లూం నేత కార్మికులు, పద్మశాలి సమాజాన్ని పట్టించుకోలేదని, రెండు పార్టీలు శవ రాజకీయాలు చేస్తున్నాయని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడ్డ వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయి, తంగళ్లపల్లిలో అంకారపు మల్లేశం కుటుంబాలను, కాంగ్రెస్ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పది సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్, సిరిసిల్లకు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సిరిసిల్ల నేత కార్మికులు, పద్మశాలి సమాజానికి ఏమీ చేయలేదని అన్నారు. బీజేపీ వస్త్ర పరిశ్రమకు 12 శాతం జీఎస్టీ వేసిందని అన్నారు. 26 వేల మరమగ్గాలపై పేద నేత కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ ఆర్డర్లకు సంబంధించి రూ.275 కోట్ల బకాయిల బిల్లులు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చెల్లించే ప్రయత్నం చేస్తుందని అన్నారు.ఎలక్షన్ కోడ్ ముగిసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం పవర్‌లూం పరిశ్రమ కోసం కొత్త పాలసీ తీసుకవస్తుందని అన్నారు.

పొలిమేర వరకు తరిమికొడతాం : మంత్రి పొన్నం

శవ రాజకీయాలు చేస్తూ పది సంవత్సరాలు అధికారంలో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే పరిస్థితి వస్తే తప్పులు, అప్పులు చేసిన వారిని పొలిమేర వరకు తరిమికొడతామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిరిసిల్లలో ఆత్మహత్యలు దురదృష్టకరమని అన్నారు. గత ప్రభుత్వంకు కేవలం బతుకమ్మ చీరలపై ధ్యాసే ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 1 ద్వారా బట్ట ఆర్డర్లు తెలంగాణ వ్యాప్తంగా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, అకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్యశివప్రసాద్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల బాలయ్య దీపదాస్‌కు వినతిపత్రం అందించారు.



తంగళ్లపల్లిలో కార్మిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న దీపదాస్ మున్షీ

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అవినీతిమయం

● గంగాధరలో ఏసీబీకి చిక్కిన ఎస్ఆర్వో

● గతంలో స్టాంపుల కుంభకోణంలో సస్పెండ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27 : స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో లంచాలు లేనిదే ఏ ఫైల్ కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయి. ఇళ్లు, ఇంటిస్థలాలు, భూములు, మార్టిగేజ్, తదితర రిజిస్ట్రేషన్‌లు జరగాలంటే అధికారులకు లంచాలు ముట్టాల్సిందే. తాజాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కరీంనగర్ డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శివారపు సురేష్‌బాబు నెల రోజుల కిందటే గంగాధర ఇంచార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా వెళ్లి శనివారం కార్యాలయం అటెండర్ కొత్తకొండ శ్రీధర్ ద్వారా 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గతంలో సురేష్‌బాబు స్టాంపుల కుంభకోణంలో నిందితుడిగా ఉండి ఒకసారి సస్పెండ్‌కు కూడా గురయ్యాడు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పురాలేదని విమర్శలు వస్తున్నాయి.

● ఎస్ఆర్వో సురేష్‌బాబు ఇంటిలో ఏసీబీ సోదాలు

లంచం డబ్బులు తీసుకుంటూ ఏసీబీ పోలీసులకు పట్టుబడిన ఎస్ఆర్ఓ సురేష్‌బాబును గంగాధరలో కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ పోలీసులు కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి 12 లక్షల 30 వేల నగదుతోపాటు 350 గ్రాముల బంగారు ఆభరణాలను, ఇతర కీలక డాక్యుమెంట్లు సీజ్ చేశారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఎస్ఆర్ఓ సురేష్‌బాబు, కొత్తకొండ శ్రీధర్‌లను ఆదివారం కరీంనగర్ ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరుస్తామని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి తెలిపారు.

● స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ, ఆర్టీఏ, అటవీశాఖతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఇదే విధంగా ప్రభుత్వ అధికారులు వారి కార్యాలయాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్స్, కాంటాక్టు ఉద్యోగులతో లంచాలు డబ్బులు తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖకు పట్టుబడ్డారు. లంచం డబ్బులు తీసుకుంటూ ఇటు ఉద్యోగం, అటు కోర్టు కేసులతో ఆర్థికంగా నష్టపోతున్నారు.



ఎస్ఆర్ఓ సురేష్‌బాబు ఇంటిలో సోదాలు చేస్తున్న ఏసీబీ పోలీసులు

బావిలో పడి వృద్ధురాలి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 27: మానకొండూర్ గ్రామానికి చెందిన బొల్లం శివమ్మ (85) అనే వృద్ధురాలు శనివారం బావిలో పడి మృతి చెందింది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శివమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయింది. శనివారం శివమ్మ తన రెండో కుమారుడు బొల్లం శంకర్ ఇంటిలోని చేద బావిలో పడి ఉండడాన్ని కుటుంబీకులు గమనించారు. బావిలో నుంచి బయటికి తీయగా అప్పటికే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి శనివారం జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 25 మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపరచగా అందులో ఒక వ్యక్తికి 7 రోజులు, మరో వ్యక్తికి 5 రోజులు, ఆరుగురు వ్యక్తులకు 3 రోజుల వంతున జైలుశిక్షతో పాటు మొత్తం 16,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 17 మందికి 25 వేల రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

ఖనిలో రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు గోదావరిఖని వేదికైంది. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఈ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగనున్నది. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనున్నాయి. 10వ సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌ను సింగరేణి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో నిజామాబాద్, వరంగల్ జట్లు తొలి మ్యాచ్‌లో పోటీపడగా నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో వనపర్తి, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో వనపర్తి జట్టు విజయం సాధిం చింది. మూడవ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరుగగా డ్రాగా ముగిసింది. 5వ మ్యాచ్ రంగారెడ్డి, మెదక్ జట్ల మధ్య జరిగి న మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. 6వ మ్యాచ్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్ నల్గొండ, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు గెలుపొం దింది.

ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ ఆర్పీ నాయుడు, కోశాధికారి సామాల సత్యనా రాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

● పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా తాగునీరు సరఫరా చేయాలని అందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మిషన్‌భగీరథ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. శనివారం జిల్లాలోని రుద్రవరం ఇంటెక్‌వెల్, అగ్రహారం నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోనీటి నిల్వ పూర్తి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 5.90 టీఎంసీలకు తగ్గడం వల్ల వేసవిలో మిషన్‌భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. మిషన్ భగీరథ నీటి అవసరాలు, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మూడు నెలలకు 0.36 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని ప్రస్తుతం 4 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉందని వివరించారు. ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు సమృద్ధిగా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, మిషన్‌భగీరథ సీఈ అమరేంద్ర, ఎస్ఈ రవీందర్, ఈఈలు విజయ్‌కుమార్, జానకి తదితరులు ఉన్నారు.



నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సందీప్ కుమార్ సుల్తానియా

రాజన్న సేవలో సందీప్ కుమార్ సుల్తానియా

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమిలతో కలిసి ఆయన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనము గావించారు.

వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్27: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ పరిధిలో ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి శనివారం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 30నుంచి 40సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన దశలో ఉందని, మృతుడు నలుపురంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు ఎలగందుల గ్రామ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్27: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణ పతి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు.



క్యూలైన్‌లో భక్తులు

లక్ష్మీనగర్‌లో కుక్కల స్వైర విహారం

● ఆరుగురు చిన్నారులపై దాడి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: గోదావరిఖనిలో పిచ్చి కుక్కల స్వైర విహారం ఆగడం లేదు. వారం రోజుల క్రితం మార్కండేయకాలనీలో ఎనిమిది మందిపై దాడి చేయగా శనివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పిచ్చి కుక్కలు ఆరుగురు చిన్నారులపై దాడికి పాల్పడ్డాయి. ప్రహస్య, చక్రిశ్రీ, నిత్య మరో ముగ్గురు చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. గాయాలపాలైన చిన్నారులను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రాత్రివేళల్లో కుక్కలు నడిచి వెళ్లేవారిపై, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నాయి. గత ఏడాది ఎల్‌బీనగర్‌లో కుక్కలు మోటార్ సైకిల్‌పై వెళుతున్న హమాలీని వెంబడించగా వాహనం అదుపు తప్పి కార్మికుడు మృతి చెందాడు. అయినా కార్పొరేషన్ అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. గుంపులు గుంపులుగా కోతులు, కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, ఏప్రిల్ 27 : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం మండలంలోని నాలుగు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పరిశీలించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులను ఇబ్బందుల పాలు చేయవద్దవన్నారు. రైతులను ఎవరైనా ఇబ్బందుల పాలు చేస్తే ఫోన్ చేయాలన్నారు. సమస్యను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు వెంటనే వస్తారన్నారు. అనంతరం మండలంలోని రైస్ మిల్లు వద్దకు వెళ్లి ధాన్యం దిగుమతి చేసుకునే విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మిల్లర్ నిర్వాహకులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, సీనియర్ నాయకులు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, ముత్యం శంకర్, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

రామలింగేశ్వర స్వామి జాతరకు అడ్లూరికి ఆహ్వానం

ధర్మపురి, ఏప్రిల్ 27: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో నిర్వహించే శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షికోత్సవ, జాతర, శివపార్వతుల కల్యాణం కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్ ఆహ్వానించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉన్న ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, సతీసమేతంగా వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందించారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్, సుధాకర్, రామదాసు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించాలి: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్, జువ్వాడి నర్సింగ రావు

కోరుట్ల, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్నికల ప్రచార సీడీని జీవన్‌రెడ్డి ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రచార రథాలను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ లక్ష్మణ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులలోనే ఇచ్చిన హామీలు అమలుకు కృషి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని గతంలో కోరుట్ల ప్రాంతం మాజీ మంత్రి రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, అన్వర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కొంత రాంజం, సత్యనారాయణ గౌడ్, వెంకటేశ్వర్లు, సోగ్రబీ పాల్గొన్నారు.

మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు పర్యటన

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 27: మండలంలోని మేడిపల్లి గ్రామంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పర్యటించనున్నట్లు బీజేపీ అసెంబ్లీ మాజీ కన్వీనర్ ఏలేటి ముత్యంరెడ్డి తెలిపారు. శనివారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి, మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఈనెల 28 పర్యటించి పార్టీ నాయకుల కుటుంబాలను పరామర్శించనున్నట్లు తెలిపారు. మాజీ గవర్నర్ పర్యటనలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

యువ చౌపాల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ దోనికెల నవీన్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 27: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే యువ చౌపాల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ ధోనికెల నవీన్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో నిర్వహించే యువ చౌపాల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు సుంకేట విజయ్, మహేష్, సాయిచంద్, రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రాజు, రమేష్, శ్రీకాంత్, విజయ్, నాయకులు, పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

కొడిమ్యాల, ఏప్రిల్ 27: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో క్షయ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు గల పలువురి తెమడను సేకరించి జగిత్యాల ఆసుపత్రికి పంపారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గటం లాంటి లక్షణాలు ఉంటే తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి క్షయ వ్యాధి గ్రస్తుడికి పోషణ భత్యం కింద రూ. 500 రూపాయలు దాతల సహకారంతో పోషణ కిట్లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, ఎస్‌టీఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, లచ్చయ్య. సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలి

రాయికల్, ఏప్రిల్ 27: రాయికల్ మండలంలోని రామాజీపేటలో ఈ నెల 24న కులం పేరుతో దూషించిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శనివారం పేర్కొన్నారు. ఈ నెల 24న రాత్రి 10 గంటలకు రోడ్డుపై వెళ్తున్న ఉదయ్ అనే వ్యక్తిని ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేసి కులం పేరుతో దూషించినట్లు కేసు నమోదైంది. ఈ వ్యక్తి నుంచి ప్రాణ భయం ఉందని, మాపై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారని బాధితులు పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కరంగుల వసంత కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజనాల మధు, రామాజీపేట సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు

● డబుల్ రోడ్డు కోసం తప్పని నిరీక్షణ ● గత ఎన్నికల ముందు హడావుడిగా భూమిపూజ



భూషణరావుపేటలో ఇరుక్కుపోయిన వాహనాలు

కథలాపూర్, ఏప్రిల్ 13: గత ప్రభుత్వం పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఎన్నో రోజులుగా ఎదురు చూడగా ఎట్టకేలకు పల్లె రోడ్లు బాగు పడుతున్నాయని ఎంతో ఆశగా ఉన్న జనాలకు నిరాశే మిగులుతోంది. రోడ్ల నిర్మాణాలకు టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకున్నా అ గ్రిమెంట్లు చేసుకోలేదని తెలుస్తోంది.

రోడ్ల నిర్మాణాలకు రు. 13.5 కోట్లు కేటాయింపు

గత ఏడాది అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాల కోసం రూ. 13.5 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భూషణరావుపేట నుం చి మండల కేంద్రంకు డబుల్ రోడ్డు కోసం రూ. 6 కోట్లు ఆర్‌అండ్‌బీ శాఖ నిధులు మంజూరు చేసింది.

పంచాయతీరాజ్ పరిధిలో గల గుంటిపెర మాండ్లు ఆలయం నుంచి చింతకుంట దాకా రూ. 2 కోట్లు, భూషణరావుపేట నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ లింకు రోడ్డుకు రూ. 2.5 కోట్లు, దూలూరు నుంచి పోసానిపేట రోడ్డుకు రూ. 3 కోట్ల చొప్పున నిధులు వెచ్చించారు. ఆ సమయంలో ఎన్నికలు ఉండడం వల్ల ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఆన్‌లైన్ టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకోక పోవడంతో సమస్య మొదటికొచ్చింది. ప్రభుత్వం మారడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా బిల్లులు చెల్లింపులో జాప్యం చేసుకుంటుందనే భావనతో అగ్రిమెంట్లు చేసుకోవడం లేదని తెలుస్తోంది. అధ్వానంగా మారిన రోడ్లతో జనం ఇక్కట్ల పాలవుతున్న నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రభుత్వం చొరవ చూపి పనులను తొందరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు ఇరుకుగా ఉన్నందువల్ల ఎదురుగా వాహనాలు వస్తే వెళ్లడం కష్టంగా మారుతోందని వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు భారీ వాహనాలు వెళ్లే దాకా వేచిచూడాల్సిన పరిస్థితి దాపురించిందని ఆందోళన వెలిబు చ్చుతున్నారు

రోడ్ల పనులు పూర్తి చేస్తే అవస్థలు తీరుతాయి

గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, రైతు భూషణరావుపేట



ప్రభుత్వం రోడ్ల మెరుగు కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తే సమస్యలు తొలగిపోతాయి. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేయించి పనులు పూర్తి చేయించాలి. పల్లె రోడ్లను బాగు చేస్తే రవాణా సదుపాయాలు మరింత పెరుగుతాయి. నిధులను సద్వినియోగం చేసుకుని రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే పల్లె ప్రజల అవస్థలు తీరుతాయి.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 27 :జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు హాజరై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతతో కలిసి పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు రాంచందర్ రావు, నారపాక రమేష్, ఆనందరావు, సమిండ్ల శ్రీనివాస్, బిక్షపతి, శ్రీలత రాంమోహన్ రావు తదితరులు ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వే డుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్ర హం వద్ద ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు మధ్య డీసీ ఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పార్టీ జెండాను ఎగుర వేశారు. అనం తరం గత పదేళ్ల కాలంలో కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్, ప్రధాన కార్యదర్శి గడ్డం బాలరాజు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రం, మండలంలోని హిమ్మతురావుపేట గ్రా మంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కేకు కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, నాయకులు ఉన్నారు.

పోస్టులో ఓటర్లకు గుర్తింపు కార్డులు



గుర్తింపు కార్డులు, లేఖలను ప్రత్యేక కవర్లలో పెడుతున్న అధికారులు

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కొత్త ఓటర్లకు ప్రస్తుతం ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ జరుగుతోంది. ఈ యేడాది పలు విడతల్లో ప్రకటించిన ఓటరు జాబితాలకు అనుగుణంగా పంపిణీ చేపట్టారు. జిల్లాలో దాదాపుగా వేల దరఖాస్తులను అధికారులు పరిష్కరించారు. సుమారు 50 వేలకు పైగా ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించి..తపాల శాఖ ద్వారా ఓటర్ల చిరు నామాలకే పంపిస్తున్నారు. ఆ తరువాత కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారికి సంబంధించిన గుర్తింపు కార్డుల ముద్రణ పూర్తి చేసి పంపిణీ చేస్తున్నారు. ఇక నుంచి ఓటరు గుర్తింపు కార్డుల జారీ, ముద్రణను ప్రతి వారం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం జారీ చేస్తున్న ఓటరు గుర్తింపు కార్డులను... అత్యాధునిక ఫీచర్లతో ముద్రించారు. నకిలీలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రెస్‌ల్లోనే ముద్రిస్తున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఓటరు గుర్తింపు కార్డును ఆన్‌లైన్‌లోనూ డౌన్‌లోడ్ చే సుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. సేవా పోర్టల్ నుంచి ఇ-ఎపిక్ డౌన్ లోడ్ చేసుకొని..పోలింగ్ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డుగా వినియోగించుకోవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది. కొన్ని రోజులుగా కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల విభాగం అధికారులు ఓటర్లకు గుర్తింపు కార్డులు, ఓటరు ప్రతిజ్ఞ లేఖలు పంపిణీ చేసే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

కొడిమ్యాల, ఏప్రిల్ 27 : కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండల బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. శనివారం మండలంలోని హిమ్మతురావుపేట, నాచుపల్లి, నమిళికొండ, తిప్పయ్యపల్లి, కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వినోద్‌కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నమిళికొండలో బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణా రావు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 27 : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఎంపికైనట్లు శనివారం ప్రధానోపాధ్యాయుడు జితేందర్ తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో మీడిల్, లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా 600మీటర్లల్లో విద్యార్థులు కాశవేని దేవి, శ్రీప్రసన్న, 400మీటర్లల్లో ఐశ్వర్య, 800మీటర్లల్లో అవినాష్‌లు మంచి ప్రతిభ కనబరించారని పీఈటీ కార్తీక్ వివరాలన తెలిపారు. దీంతో విద్యార్థులను ఈనెల 28న సూర్యపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందుకు వారిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం ఎన్నికల ప్రచారం

ధర్మపురి, ఏప్రిల్ 26: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో చేప ట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వ చీఫ్‌విప్‌గా, మంత్రిగా ఈ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేష్‌కుమార్, రైతుబంధు మండల అధ్యక్షుడు భీమయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

పెగడపల్లి : పదేళ్ల పాలనలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పట్టం కట్టాలని మండల వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం మండలంలోని నందగిరి, రాంబద్రునిపల్లి గ్రామాలలో మండల నాయకులు ప్రచారం చేశారు. గంగాధర్, పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

రాయికల్, ఏప్రిల్ 27: రాయికల్ పట్టణంలోని 10వ వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. తాగేందుకు, నిత్యావసరాలకు కూడా నీరు రావడం లేదని, గతంలో రెండు రోజులకు ఒకసారి నీరు ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాచకొండ సుమలత, రాజుబాయ్, పెగ్గెర్ల సత్తయ్య, నాగమ్మ, బూర్ల అనసూయ, చాకలి కమల, రాజక్క, లక్ష్మి పాల్గొన్నారు.

యాదవులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

రాయికల్, ఏప్రిల్ 27: యాదవులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు వాసరి రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి లాల్‌చావ్లా రాజేష్ యాదవ్ అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన భూషణవేణి వైష్ణవి స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్స రం చదివి ఎంపీసీలో 983 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. వైష్ణవిని యాదవ సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, యువకులు ఆమెను ఆదర్శంగా తీసుకుని మంచి ఉన్నత హోదాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు వేల్పుల స్వామి యాదవ్, మండల నాయకులు ఆసరి మల్లేష్ యాదవ్, గడ్డం మల్లారెడ్డి యాదవ్, బూసనవేని శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుండా ఐస్ క్రీమ్‌లు అమ్మితే చర్యలు

ఫుడ్ సేఫ్టీ సెక్షన్ జిల్లా అధికారి అనూష



మెట్‌పల్లిలోని ఐస్ క్రీమ్ బండ్లను పరిశీలిస్తున్న ఎఫ్ఎస్ఎస్ఐ అనూష

మెట్‌పల్లి, ఏప్రిల్, 27 : లైసెన్సులు లేకుండా ఐస్ క్రీమ్‌లను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకోబడునని ఫుడ్ సేఫ్టీ సెక్షన్ జిల్లా అధికారి అనూష హెచ్చరించారు. పట్టణంలో నాణ్యంత ప్రమాణాలు పాటించకుండా ఐస్ క్రీమ్‌లను విక్రయిస్తున్నరని ఫిర్యాదు మేరకు శనివారం పట్టణంలోని ఐస్ క్రీమ్‌ల విక్రయి కేంద్రాన్ని పరిశీలించి, లైసెన్సు లేకుండా ఐస్ క్రీమ్ కవర్లపై ఎలాంటి మ్యాను ఫ్యాక్చర్, ఎక్స్‌పైర్ డేట్‌లు ప్రింట్ చేసినవి లేనందున సీజ్ చేశారు. వివరాలు, మ్యాను ఫ్యాక్చర్, ఎక్స్‌పైర్ డేట్‌లు ప్రింట్ చేయకుండా ఏలా విక్రయిస్తారని నిర్వాహకులను ప్రశ్నించి విక్రయి కేంద్రాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఐస్ క్రీమ్‌లను విక్రయించొదన్నారు. తూప్రాన్‌లో తయారు చేసిన ఐస్ క్రీమ్‌లను విక్రయించడానికి మెట్‌పల్లిలో కేంద్రం ఏర్పాటు చేసుకున్నరన్నారు. ఐస్ కేంద్రానికి ఎలాంటి లైసెన్సులు తీసుకోకుండా బండ్లను ఏర్పాటు చేసుకోని పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఐస్ క్రీమ్‌లు విక్రయిస్తున్నరని ఫిర్యాద్ చేయడంతో తనిఖీ చేశామన్నారు. ఫుడ్ సేఫ్టీ సెక్షన్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు పట్టణంలో వెలువడుతున్నాయి. ఈమె వెంటా పోలీసు, మున్సిలప్ సిబ్బంది ఉన్నారు.

లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాలి

మల్లాపూర్, ఏప్రిల్, 27 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాలని కరస్పాండెంట్ అనిల్‌సింగ్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తధాంరాజ్‌పల్లి గ్రామంలోని కేరళ హై స్కూల్ పూర్వ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు పొందిన వారిని శాలువలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

బోరు బావి ప్రారంభం

రాయికల్, ఏప్రిల్ 27: రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్‌లో నిర్మించిన పోచమ్మ ఆలయంలో బలుసు దుబ్బారెడ్డి, కాశమ్మ దంపతుల విరాళంతో నిర్మించిన బోరు బావిని గ్రామ మాజీ సర్పంచ్ పాలకుర్తి రవి శనివారం ప్రారంభించారు. దాదాపు రూ.50 వేలతో నిర్మించిన బోరుబావిని ఏర్పాటు చేసి భక్తులకు నీటి సౌకర్యం కల్పించిన సుబ్బారెడ్డి దంపతులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుపురం రాజన్న, రాజరెడ్డి, పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ, గ్రామస్థులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, ఏప్రిల్ 27: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో నిర్మితమైన పోచమ్మ ఆలయంలో శనివారం పోచమ్మ, పోతురాజు బలిపీఠం, సారలమ్మ, నీరలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేములవాడ వేద పండితులు రాజేందర్ శర్మ పర్యవేక్షణలో ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా విగ్రహాల ఊరేగింపు, యాగశాల ప్రవేశం, జలాధివాస, మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పాలకుర్తి రవి, నాయకులు అనుపురం రాజన్న, సింగిల్ విండో డైరెక్టర్ నాగుల మల్లయ్య, యాచమనేని దీపక్‌రావు, గడ్డం రాజరెడ్డి, అర్చకులు చొప్పకట్ల కార్తీక్, నందగిరి భాను, గోవిందుల శ్రీనివాస్, ఎస్పీ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మల్లాపూర్, ఏప్రిల్, 27 : మండలంలోని మొగిలిపేట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డం శ్రీనివాస్ అనే మత్స్య కార్మికుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు బీజేపీ నాయకులు రూ. 5వేలను నగదును అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ కొంత కాలం నుంచి పక్షవాతం, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో కుటుంబ సభ్యులు ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్న చికిత్స చేయించిన ఫలితం దొరకలేదు. దీంతో గడ్డం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం, నాయకులు, సేవకులు ఆర్థిక సాయం చేసి అండగా నిలబడాలని యువత కోరుతున్నారు.

మే డేను జయప్రదం చేయాలి

మెట్‌పల్లి, ఏప్రిల్, 27: మే డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కార్మికులు పిలుపుని చ్చారు. శనివారం మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు శ్రీకాంత్, లక్ష్మణ్, మహషే, రాజశేఖర్, శంకరమ్మ, గంగారం, సురేష్, రాకేష్, బీవోసీ కార్యదర్శి రామిల్ల రాంబాబు, ఉస్మాన్ పాల్గొన్నారు.

మల్లారెడ్డి సేవలు మరువలేనివి



నివాళిలు అర్పిస్తున్న నాయకులు

సారంగాపూర్, ఏప్రిల్, 27 : మండల ప్రజలకు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోండ్ర మల్లారెడ్డి అందించిన సేవలు మరువ లేనివని పలువురు అన్నారు. శనివారం మల్లారెడ్డి 14 వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మండల పేద ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన చేసిన సేవలకు గుర్తుగా సారంగాపూర్ మండలాన్ని మల్లారెడ్డి మండలంగా పేరు మార్చే విధంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, న్యార బోయిన గంగాధర్, మానాల లక్ష్మీనారాయణ, లోఖ్యారెడ్డి, కొక్కు గంగారాం, రమణ, కోటిరెడ్డి, తిరుపతి, రాజయ్య, అంజిరెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్ గౌడ్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

గొల్లపల్లి, ఏప్రిల్ 27: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో పలు బాధితల కుటుంబాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణకుమార్ శనివారం పరామర్శించారు. మండలంలోని లొత్తునూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కాళ్ల రాకేష్ కుటుంబాన్ని పరామర్శించారు. పదివేల ఆర్థిక సాయం అందించారు. అలాగే మండలంలోని ఇబ్రాయెపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖం యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.